క్రీడా ప్రాంగణం.. నిర్వహణ అధ్వానం

- పిచ్చి మొక్కలు, కంపచెట్లతో నిండిపోయిన ఆట స్థలాలు
- వినియోగంలోకి తీసుకురావాలని యువత విన్నపం

అర్వపల్లి : పల్లెల్లో క్రీడాకారులను తీర్చిదిద్దడంతో పాటు యువతను, విద్యార్థులను ఆటల వైపు మళ్లించి, వారిని శారీరకంగా, మానసికంగా దృఢంగా మార్చేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితమయ్యాయి. వీటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. కొన్ని క్రీడా ప్రాంగణాల్లో పిచ్చి మొక్కలు, కంపచెట్లు పెరగడంతో ఆటలు ఆడేందుకు ఏమాత్రం అనువుగా లేకుండా తయారయ్యాయి.



ఉయ్యాలవాడలో కంపచెట్లతో నిండిన క్రీడా ప్రాంగణం

మరికొన్ని చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా మారాయి. క్రీడా ప్రాంగణాలను వాడుకోలేని పరిస్థితి ఉండటంతో గ్రామాల్లో క్రీడాకారులు, యువత, విద్యార్థులు నిరాశకు గురవుతున్నారు.

పంచాయతీకి ఒక ప్రాంగణం చొప్పున ఏర్పాటు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2022 సంవత్సరంలో జాజిరెడ్డిగూడెం మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా వీటిని ఏర్పాటు చేశారు. గ్రామ యువత, విద్యార్థులు వ్యాయామం చేసుకునేందుకు కొన్నిచోట్ల పలు రకాల పరికరాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా క్రీడా సామగ్రి అందజేశారు. అయితే, క్రీడా ప్రాంగణాల నిర్వహణ అధ్వానంగా ఉండటంతో పరికరాలు, క్రీడా సామగ్రితో పని లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలను బాగు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని క్రీడాకారులు, యువత కోరుతున్నారు.

కంపచెట్లతో నిండిపోయింది

మా గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం ప్రస్తుతం కంపచెట్లు, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. దానిని బాగు చేయించి క్రీడలకు అనువుగా ఉండేలా మార్చాలి.



– గుండె ఈశ్వర్, ఉయ్యాలవాడ

నిరుపయోగంగా మారాయి

గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వ పాఠశాలల్లో కొన్ని ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. వాటికి బోర్డులు బిగించారే తప్ప పరికరాలను ఏర్పాటు చేయలేదు. అన్నిటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలి.



– మచ్చ నర్సయ్య, కాసర్లపహాడ్

క్లుప్తంగా

నేడు తిమ్మాపురంలో ఎమ్మెల్యే పర్యటన

అర్వపల్లి : మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఎమ్మెల్యే మందుల సామేల్ శుక్రవారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ జరుపనున్నారు. అదేవిధంగా గ్రామంలో రూ.70 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

తొండ గ్రామానికి..

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మండలంలోని తొండ గ్రామంలో శుక్రవారం నిర్వహించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే మందుల సామేల్ హాజరవుతారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్సోజు నరేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల కమిటీ ఎన్నిక


రిటైర్డ్ ఉపాధ్యాయుడు జానయ్యను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

ఆత్మకూర్(ఎస్) (సూర్యాపేట) : రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల కమిటీని ఆత్మకూర్(ఎస్)లో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కాసర్ల వీరారెడ్డి, కార్యదర్శిగా షేక్ అబ్దుల్లా, కోశాధికారిగా దండ వెంకటరెడ్డితో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయులు గిలకత్తుల జానయ్య, చిలుముల రాంరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు గణపవరం పుల్లయ్య, ఎన్నికల అధికారి సంకలమద్ది పిచ్చిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు తంగేళ్ల లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా శంకర్‌రెడ్డి

సూర్యాపేట అర్బన్ : తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నూతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామానికి కందాల శంకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. సూర్యాపేటలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో గురువారం నిర్వహించిన ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశంలో శంకర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తానని తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఏపీఓ

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల ఏపీఓగా టెక్నికల్ అసిస్టెంట్ బుక్క యాదమ్మకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డీఆర్‌డీఓ వీవీ.అప్పారావు ఉత్తర్వులు జారీ చేశారు. యాదమ్మకు ఎంపీడీఓ టి.గోపి గురువారం ఉత్తర్వులు అందజేయగా ఆమె ఉపాధి హామీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ శిల్పిక, టీఏ నాగమణి, సీఓల సంఘం రాష్ట్ర నాయకుడు బొబ్బిలి సుధీర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వీధి కుక్కలను నియంత్రించాలని వినతి

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని పొట్లపహాడ్ గ్రామంలో వీధి కుక్కల బెడదను నివారించాలని కోరుతూ టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పుట్టల శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ జానయ్యకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామంలో వీధి కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తూ చిన్నాపెద్దా అనే తేడా లేకుండా దాడి చేసి గాయపరుస్తున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మధు, సురేశ్, నాగరాజు, వేణు, సైదులు, అభినయ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన

సూర్యాపేట : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ అన్నారు. గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహం (ఏ) విద్యార్థులకు గురువారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు గొప్ప లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానిని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. మత్తు పదార్థాలకు, బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని మాచారం గ్రామంలో ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను ఎంపీడీఓ జానయ్య గురువారం పూడ్చి వేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలి

- డీపీఓ యాదగిరి

అర్వపల్లి : గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు తగిన చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి సూచించారు. మండలంలోని అడివెంల గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. రికార్డులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోపి, పంచాయతీ కార్యదర్శి గుండగాని మహాలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న డీపీఓ యాదగిరి

సీపీఆర్ విధానంపై పోలీసులకు అవగాహన


సీపీఆర్ విధానంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

సూర్యాపేట టౌన్ : అత్యవసర సమయాల్లో సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను కాపాడొచ్చని జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సీపీఆర్ విధానంపై ప్రభుత్వ వైద్యులతో గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసులకు శిక్షణ ఇప్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదాలు జరిగి ఎవరైనా క్షతగాత్రులు ప్రాణాపాయ స్థితిలో ఉన్నా లేదా గుండెపోటు వంటివి వచ్చినప్పుడు సీపీఆర్ చేయడం మంచి ఫలితాలనిస్తుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సిబ్బందికి సీపీఆర్‌పై విడతల వారీగా శిక్షణ ఇస్తామని చెప్పారు. జిల్లా పోలీస్ సిబ్బంది శిక్షణను సద్వినియోగం చేసుకొని మెళకువలు నేర్చుకోవాలని, తద్వారా బాధితులను కాపాడొచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఆర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్ రెండో దశకు బీఎన్ రెడ్డి పేరు పెట్టడమే సబబు

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు

తుంగతుర్తి : శ్రీరాంసాగర్ రెండో దశకు ఆర్డీఆర్ పేరు పెట్టడం సమంజసం కాదని, వెంటనే ఆ జీఓను ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పద్మశాలీ భవనంలో సీపీఎం మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన అఖిలపక్షాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రీరాంసాగర్ రెండో దశ సాధన కోసం దివంగత మాజీ ఎంపీ భీమిరెడ్డి నర్సింహారెడ్డి (బీఎన్ రెడ్డి) ఎనలేని కృషి చేశారని అన్నారు. మిట్ట ప్రాంతాలుగా ఉన్న తుంగతుర్తి, సూర్యాపేటలలో శ్రీరాంసాగర్ రెండో దశ కాల్వను పూర్తి చేస్తేనే ఇక్కడి రైతాంగం కష్టాలు తీరుతాయని, వలస పోతున్న కూలీలకు ఉపాధి దొరుకుతుందని ఆయన ఆలోచించారని అన్నారు. అందుకే శ్రీరాంసాగర్ రెండో దశకు బీఎన్ రెడ్డి పేరు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య, మాజీ జెడ్పీటీసీ తాటి విజయమ్మ, మాజీ ఎంపీపీ కొత్తగట్టు మల్లయ్య, జోగునూరి సుందర్‌రావు, తునికి సాయిలు, రైతు సంఘం నాయకులు పల్లా సుదర్శన్, ఉప్పలయ్య, సీపీఐ నాయకులు కోట రామస్వామి, సీపీయూఎస్ నాయకుడు మట్టపల్లి లింగయ్య, సీపీఎం నాయకులు విష్ణుమూర్తి, బోనాల వెంకన్న, ఉప్పుల సోమయ్య, పాలబిందెల జానయ్య, కాంతయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


వి.సుప్రియ

ఆత్మకూరు (ఎస్) (సూర్యాపేట) : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని వేములకొండ సుప్రియ అండర్-17 విభాగంలో జరుగనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల భువనగిరిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయి పోటీల్లో సుప్రియ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి చట్టం తీసుకురావాలి

సూర్యాపేట అర్బన్ : వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం సమగ్ర శాసన చట్టం తీసుకురావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో గురువారం నిర్వహించిన ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. వ్యవసాయ కార్మికుల జీవనం దుర్భరంగా ఉందని, తినడానికి తిండి లేక, ఉండటానికి ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ భూమిలేని వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని వాగ్దానం చేసిందని, అధికారంలోకి వచ్చి 22 నెలలు అవుతున్నా నేటికీ అమలు చేయడం లేదన్నారు. 50 ఏళ్లు నిండిన వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.7,500 పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు, జిల్లా ఆఫీస్ బేరర్స్ పోసనబోయిన హుస్సేన్, సోమపంగా జానయ్య, నల్ల మేకల అంజయ్య, పటాన్ మహబూబ్ అలీ, జంపాల స్వరాజ్యం, మిట్టపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య

కార్మికుల హక్కుల సాధనకు పోరాడాలి

సూర్యాపేట అర్బన్ : కార్మికుల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ పిలుపునిచ్చారు. సూర్యాపేటలోని గాంధీ పార్క్‌లో టీయూసీఐ(ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా) జిల్లా అధ్యక్షుడు గొడ్డలి నర్సయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించిన జిల్లా రాజకీయ శిక్షణ తరగతుల ప్రారంభోపన్యాసంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.సూర్యం మాట్లాడుతూ కార్మిక హక్కులను కాలరాస్తున్న పాలకులపై తిరుగుబాటు జెండా ఎగురవేయాలని అన్నారు. టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎల్.పద్మ మాట్లాడుతూ పారిశ్రామిక విభాగాల చట్టం, ఇన్సూరెన్స్ చట్టం, బోనస్ చట్టం, వేతనాల చెల్లింపుల చట్టం తదితరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకుడు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ హుస్సేన్, సహాయ కార్యదర్శి గోగుల వీరబాబు, కోశాధికారి ఐతరాజు వెంకన్న, జిల్లా కమిటీ సభ్యులు దర్శనం రమేశ్, చెడుపాక రవి, శేషగిరి, రజాక్, కిట్టయ్య, సంసోన్, సుధాకర్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి పద్మ

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడంలో విఫలం

మద్దిరాల : ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడంలో అధికారులు విఫలమయ్యారని బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు వంగూరి రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కమీషన్ల కోసం కొందరు అధికారులు ఇసుక ట్రాక్టర్ల యజమానులతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఒక ట్రాక్టర్ ఇసుకకు రూ.6 వేల నుంచి రూ.6,500 వరకు వసూలు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. తహసీల్దార్, కలెక్టర్ స్పందించి అక్రమ రవాణాకు సహకరించే అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బీజేపీ నాయకులు అశోక్, విక్రమ్, సాయి పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

చివ్వెంల (సూర్యాపేట) : మండల పరిధిలోని బీబీగూడెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బీబీగూడెం గ్రామ శివారులోని ఓ ఇంట్లో గ్రామానికి చెందిన కొందరు పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న సుంకరి సైదులు, కలకోట్ల రవి, పడిదల గురువయ్య, పడిదల సైదులు, కోదమగండ్ల నగేశ్, ఎదాసు నాగయ్యను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.3 వేల నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు


పెన్‌పహాడ్ : అనంతారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్, పీఏసీఎస్ చైర్మన్


తిరుమలగిరి (తుంగతుర్తి) : తొండ గ్రామంలో ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ చామంతినరేశ్

తిరుమలగిరి (తుంగతుర్తి) : రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ ఎల్సోజు చామంతినరేశ్ అన్నారు. మండలంలోని తొండ, భోక్యానాయక్ తండా, మామిడాల, జలాల్‌పురం, వెలిశాల గ్రామాల్లో గురువారం ఆమె ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. తహసీల్దార్ హరిప్రసాద్, ఏపీఎం లక్ష్మి, మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, జమ్మిలాల్, వేణురావు, సుధాకర్, వంశీ, భాస్కర్, దాచేపల్లి వెంకన్న, శేఖరయ్య, ప్రేమ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని అనంతారం, నారాయణగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ లాలు, పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ మామిడి శ్రీను, సీఈఓ ఆలకుంట్ల సైదులు, బైరెడ్డి రాంరెడ్డి, చిట్టెపు నారాయణరెడ్డి, ఎరెడ్ల జగదీశ్‌రెడ్డి, బైరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, సామ సురేందర్‌రెడ్డి, ధర్మారెడ్డి, కిరణ్, లింగయ్య పాల్గొన్నారు.

నూతనకల్ : రైతులు దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధసుధాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని యడవెల్లి, తాళ్లసింగారం, చిల్పకుంట్ల, వెంకెపల్లి, ఎర్రపహాడ్, దిర్శనపల్లి, అల్లునూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించి మాట్లాడారు. ఎంపీడీఓ సునీత, ఏపీడీ సురేశ్, ఏపీఎం వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బత్తుల నాగమల్లు, జటంగి లింగయ్య, బంటు క్రాంతి, పాండవుల లింగయ్య, పల్స లింగయ్య, పసుల అశోక్ యాదవ్, సుదర్శన్‌రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

భూమిపూజ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు

నాగారం : తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు చేతుల మీదుగా నేడు జరిగే ఇంటిగ్రేటెడ్ స్కూల్ భూమిపూజ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు కోరారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే మందుల సామేలు గతంలో ఎవరూ చేపట్టలేని విధంగా రూ.1,800 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ భూమి పూజ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ యానాల ఇంద్రసేనారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల ప్రతాప్, కాంగ్రెస్ నాయకులు కన్నెబోయిన వెంకటభిక్షం, బయ్యం వెంకన్న, మంగదుడ్ల దశరథ, కసిరెడ్డి రాంరెడ్డి, గట్టు లక్ష్మీకాంత్, ఎల్మకంటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి



మాట్లాడుతున్న మల్లు నాగార్జునరెడ్డి

సూర్యాపేట అర్బన్ : జిల్లావ్యాప్తంగా వరి కోతలు ప్రారంభమైనందున అన్ని గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జునరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీపీఎం భవన్‌లో గురువారం నిర్వహించిన తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమై సుమారు 15 రోజులు అవుతున్నా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు అన్నారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా నాయకులు కోలిశెట్టి యాదగిరిరావు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, కందాల శంకర్‌రెడ్డి, కొప్పుల రజిత, దుగ్గి బ్రహ్మం, గుమ్మడవెల్లి ఉప్పలయ్య, షేక్ సైదా, వై.వీరాంజనేయులు, పల్లా సుదర్శన్, యానాల సోమయ్య, కుసు సైదులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలను దగా చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

సూర్యాపేట : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దగా చేస్తున్నాయని సూర్యాపేట పూర్వ విద్యార్థి మిత్ర మండలి కమిటీ ప్రధాన కార్యదర్శి బయ్యా మల్లికార్జున్ విమర్శించారు. గురువారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పబ్బం గడపడం కోసం రిజర్వేషన్లపై దోబూచులాడుతున్నారని అన్నారు. 18న తెలంగాణ రాష్ట్ర బంద్‌కు మిత్ర మండలి కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నల్లపాటి అప్పారావు, కార్యదర్శులు షేక్ సైదులు, గీసా రాంచందర్, దాసరి సత్యనారాయణ, మహిళా విభాగం కార్యదర్శి శైలజ, మన్నె యాదగిరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

ఆత్మకూర్ (ఎస్) (సూర్యాపేట) : మండల పరిధిలోని ఇస్తాళాపురం ఎంపీపీఎస్ విద్యార్థులకు మెదక్ ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కో ఆర్డినేటర్ అరవింద్ సహకారంతో గురువారం రూ.50 వేల విలువైన బ్యాగులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ దారాసింగ్ మాట్లాడుతూ.. తాను చదువుకున్న పాఠశాల విద్యార్థులకు అన్ని విధాలుగా సహకారం అందిస్తున్న మెదక్ ఎస్పీ శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మల్లారెడ్డి, డేగల జనార్దన్, తూడి వెంకటేశ్వర్లు, పుప్పాల వీరన్న, ఇరుకుల శ్రీనివాస్, స్వచ్ఛంద సంస్థ నల్గొండ జిల్లా ఇన్‌చార్జి నాగేంద్ర, ఉపాధ్యాయురాలు రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేస్తున్న దాతలు

మండల స్థాయి చిత్రలేఖనం పోటీలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం మండల స్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్ఎస్ ఆధ్వర్యంలో సేవ్ ఎనర్జీ-సేవ్ ఎర్త్ అనే అంశంపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీలకు మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రిటైర్డ్ టీచర్ సుతారపు కిష్టయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు అనిల్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆర్.సైదులు, ఉపాధ్యాయులు పురుషోత్తం, ఎల్.సైదులు, వెంకటేశ్వర్లు, శంకర్, రమేశ్, మల్లిక, జ్ఞానేశ్వరి, వెంకట్‌తో పాటు మాదగాని శ్రీను, జలేందర్ పాల్గొన్నారు.


చిత్రాలను చూపుతున్న విద్యార్థులు

పూరన్‌కుమార్ ఆత్మహత్యకు కారకులపై చర్యలు తీసుకోవాలి

సూర్యాపేట : హరియాణాలో దళిత ఐపీఎస్ అధికారి పూరన్‌కుమార్ ఆత్మహత్యకు కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమల్ల హసేన్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి డిమాండ్ చేశారు. పూరన్‌కుమార్ ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ మాల మహానాడు, కేవీపీఎస్ ఆధ్వర్యంలో సూర్యాపేటలోని రైతు బజార్ అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పూరన్‌కుమార్ వంటి మేధావులు ఎంతోమంది కుల వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే దళితులు, మహిళలపై దాడులు పెరుగుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నామ వేణు, జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల నరసయ్య, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి టేకుల సుధాకర్, జిల్లా నాయకులు చిన్నపంగి నరసయ్య, దేవరకొండ గిరి, సాయికుమార్, తిరుపతి, గోపి పాల్గొన్నారు.

రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి

సూర్యాపేట అర్బన్ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్‌తో 18న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్ కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బంద్‌కు తమ పార్టీ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, వెంకట్‌యాదవ్ పాల్గొన్నారు.

సీపీఐ సంపూర్ణ మద్దతు

రాష్ట్ర బంద్‌కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ధర్మ భిక్షం భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు ఎడెల్లి శ్రీకాంత్, దశగాని హేమలత, ఐతరాజు లింగయ్య, పల్స రాజు పాల్గొన్నారు.

సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ మద్దతు

రాష్ట్ర బంద్‌కు సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ మద్దతు తెలియజేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ వెల్లడించారు. సూర్యాపేటలో గురువారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు కార్మికుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అఖిల్ కుమార్, ఏపీకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు పేర్ల నాగన్న, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు గొడ్డలి నరసన్న పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

నాగారం : 18న చేపట్టే బంద్‌కు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు జాజుల సామేలు, యాదగిరి, ఆకుల సుభాష్, పూదూరి రమేశ్, మామిడి వెంకటేశ్, వీరారెడ్డి పాల్గొన్నారు.

సూర్యాపేట : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని తెలంగాణ యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారబోయిన కిరణ్‌కుమార్ ముదిరాజ్ కోరారు. ఈ మేరకు గురువారం తెలంగాణ జన సమితి నియోజకవర్గ బృందంతో కలిసి ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ మచ్చలకూరి గోపి, విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని వినయ్ గౌడ్, వేణురాజ్, నాగు నాయక్, సుమన్ నాయక్, పిట్టల మురళి, భరత్ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు


అర్వపల్లి : కోడూరులో టీకాలు వేస్తున్న సిబ్బంది

అర్వపల్లి : గాలికుంటు వ్యాధి నివారణ టీకాలతో పశువులు ఆరోగ్యంగా ఉంటాయని మండల పశువైద్యాధికారి బి.అర్జున్ అన్నారు. మండల పరిధిలోని రామన్నగూడెం, కోడూరు, కొత్తగూడెం గ్రామాల్లో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీఎల్ఓ పద్మ, సిబ్బంది మధుసూదన్, లింగయ్య, అర్జున్, యాకయ్య పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) (సూర్యాపేట) : కోటపాడు గ్రామంలో పశువైద్యాధికారులు గాలికుంటు నివారణ టీకాలను వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి వేణుగోపాలరావు, కోటపాడు పశువైద్యాధికారి నాగేంద్రబాబు, సిబ్బంది హరీశ్‌కుమార్, గోపాలమిత్రలు సైదులు, లక్ష్మయ్య, కృష్ణప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.